# వాస్తవం

డెయిలీ. కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

మంగళవారం 12.05.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)



జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం

Red 914/2015

జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా

జర్నలిస్ట్స్ హక్కుల కోసం....

వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...

సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110


## 'వన్ కేస్ వన్ డాటా'ను ప్రారంభించిన సీజేఐ

**కక్షిదారులకు సహాయకారిగా 'సు సహాయ్' చాట్‌బాట్**

**న్యూఢిల్లీ, మే 11:** వివిధ కోర్టుల్లో ఉన్న కేసులకు సంబందించి న్యాయ సమాచారాన్ని ఒకే ఛత్రం కింద తీసుకొచ్చేందుకు నిర్దేశించిన 'వన్ కేస్ వన్ డాటా'ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రారంభించారు. దేశంలోని అన్ని స్థాయి కోర్టులు అంటే.. తాలూకా స్థాయి నుంచి సుప్రీంకోర్టు వరకు ఉన్న సమాచారం అంతా 'వన్ కేస్ వన్ డాటా' కిందకు వస్తుంది. దీని కింద.. ఒకే కేసుకు సంబంధించి హైకోర్టులు, జిల్లా కోర్టులు, తాలుకా కోర్టుల్లో ఉన్న సమాచారం అంతా అందరికీ అందు బాటులో ఉంటుందని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు 'వన్ కేస్ వన్ డాటా' కింద కేసులు జాప్యం జరగకుండా వేగంగా పరిష్కారమవుతా యని, కేసు స్థితిగతులను న్యాయస్థానాలు సులభంగా గుర్తించే అవకాశం లభిస్తుందనే అభిప్రాయాలు



వ్యక్తమవుతున్నాయి. ఇక కక్షిదారులకు కేసులకు సంబంధించి సమాచారాన్ని, కోర్టు సేవలను సులభంగా పొందేందుకు ఏఐ ఆధారిత 'సు సహాయ్' చాట్ బాట్‌ను జస్టిస్ సూర్యకాంత్ ప్రారంభిం చారు. సుప్రీంకోర్టు రిజిస్ట్రీ సౌజన్యంతో నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) 'సు సహాయ్'ను అభివృద్ధి చేసిందని ఆయన వెల్లడించారు.

## విద్యకు 15శాతం నిధులను కేటాయిస్తాం




వివరాలు 6లో




# బీజేపీ అంటే.. బ్రిటీష్ జనతా పార్టీ

**బీజేపీ అంటే బ్రిటీష్ జనతా పార్టీ అని, విభజించి పాలించడమే వారి విధానమని విమర్శించారు. మావోయిస్టులు, ముస్లింలు ఈ దేశ ప్రజలు కాదా అని రేవంత్ ప్రశ్నించారు. ప్రధాని హోదాలో మోదీ ముస్లింలు, మావోయిస్టులపై అలా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. బీజేపీ ఎన్నికల వ్యూహం నిజానికి జెమి నీ సర్కస్ లాంటిదని, దాన్ని నమ్ముకొని తెలంగాణలో అధికారంలోకి వస్తామని సంబరపడుతున్నారని ఎద్దేవా చేశారు.**

- బీజేపీ ప్రజల్ని విభజించి పాలించే పార్టీ
- కలిసిరాకుంటే ఖతం చేయడం వారి విధానం
- మోదీ.. గాలి తిని బతకమంటున్నారు
- తెలంగాణలో గెలుస్తామని భ్రమ పడుతున్నారు
- బీజేపీ తిరిగి రెండు సీట్ల పార్టీగా మారుతుంది
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రధాని నరేంద్ర మోదీ తనను కలవమని చెప్పింది కేంద్ర ప్రభుత్వంతో మాత్రమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అది కూడా రాష్ట్ర అభివృద్ధి కోసమేనని తేల్చిచెప్పారు. దాన్ని వేరేవిధంగా అర్థం చేసుకున్నారంటే అది వారి అవగాహన లోపమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.**

**హైదరాబాద్, మే 11 :** ప్రధాని నరేంద్ర మోదీ తనను కలవమని చెప్పింది కేంద్ర ప్రభుత్వంతో మాత్రమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అది కూడా రాష్ట్ర అభివృద్ధి కోసమేనని తేల్చిచెప్పారు. దాన్ని వేరేవిధంగా అర్థం చేసుకున్నారం టే అది వారి అవగాహన లోపమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అభివృద్ధి విషయం లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరిం చాలని తాను కోరానని గుర్తు చేశారు. ప్రధాని కూడా అదే ఉద్దేశంతో స్పందిస్తూ, కేంద్రంతో కలవాలని ఆహ్వానించారని, అందులో ఎలాంటి రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. అభివృద్ధి ఒక్కరితోనే సాధ్యం కాదని, కేంద్రంతో కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్న భావనతోనే మోదీ అలా అన్నారని తెలిపారు. సోమవారం రేవంత్‌రెడ్డి తన నివాసంలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పలు ప్రాజెక్టులకు ఆమోదం రావడం లేదని చెప్పారు. గత పదేళ్లలో కేసీఆర్ కేంద్రాన్ని ఏమీ అడగలేదని, పైగా మీ నిధులు వద్దని, ప్రేమ చాలంటూ మెదక్ సభలో మోదీతో కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. దేశ ప్రజలు ఏడాది పాటు బంగారం కొనొద్దని, పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని, విమానం ఎక్కొద్దంటూ మోదీ పిలుపునివ్వడాన్ని రేవంత్ తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్రం వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజలపై నిషేధం విధిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షోభం పీకల మీదకు వచ్చాక మోదీ ప్రజలకు పొదుపు మంత్రం ఉపదేశిస్తున్నారని మండిపడ్డారు. విదేశాంగ విధానంలో ప్రతిపక్షాల సూచనలను తీసుకోకుండా అహంకారంతో వ్యవహరించి దేశాన్ని సంక్షోభంలోకి నెట్టారన్నారు. తెలంగాణ ప్రజలను గాలి తిని గాల్లో బతకమని మోదీ చెప్పి వెళ్లారని ఎద్దేవా చేశారు. బీజేపీకి సంక్షోభాలు సృష్టించడమే తప్ప మేనేజ్ చేయడం చేతకాదన్నారు. కేంద్ర ప్రభుత్వం రీజినల్ రింగు రోడ్డు దక్షిణభాగం, మెట్రో రెండో దశ సహా పలు అంశాలపై జాప్యం చేస్తోందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం, మామునూరు విమానాశ్రయం, ఎలివేటెడ్ కారిడా ర్లకు రక్షణ శాఖ భూములు, మూసీకి ఏడీబీ నుంచి రుణం, బుల్లెట్ రైళ్లు లాంటి కొన్నింటినే ఇచ్చిందని తెలిపారు. అవి కూడా ఎప్పుడో రావా ల్సినవని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇన్నాళ్లు పెండింగ్‌లో పడ్డాయని చెప్పారు. రెండు లోకసభ స్థానాలతో మొదలు పెట్టిన బీజేపీ తిరిగి అక్కడికే వెళుతుందని రేవంత్ వ్యాఖ్యానించారు. బీజేపీ అంటే బ్రిటీష్ జనతా పార్టీ అని, విభజించి పాలించడమే వారి విధానమని విమర్శించారు. మావోయిస్టులు, ముస్లింలు ఈ దేశ ప్రజలు కాదా అని రేవంత్ ప్రశ్నించారు. ప్రధాని హోదాలో మోదీ ముస్లింలు, మావోయిస్టులపై అలా మాట్లాడడం దురదృష్టకరమన్నారు. బీజేపీ ఎన్నికల వ్యూహం నిజానికి జెమి నీ సర్కస్ లాంటిదని, దాన్ని నమ్ముకొని తెలంగాణలో అధికారంలోకి వస్తామని సంబరపడుతున్నారని ఎద్దేవా చేశారు.

## బండి భగీరథ్ కేసు విచారణ బాధ్యతలు రితిరాజ్‌కు



**హైదరాబాద్ సిటీ, మే 11:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు విచారణకు సైబరాబాద్ సీపీ ఎం.రమేశ్ ఆదేశాలు జారీ చేశారు. డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు విచారణ పర్యవేక్షణ బాధ్యతలను కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌కు సైబరాబాద్ సీపీ అప్పగించారు. విచారణ పురోగతిని ప్రతిరోజూ తనకు నివేదించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో డీసీపీ రితిరాజ్ వెంటనే రంగంలోకి దిగారు. సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోల?సస్టేషన్‌కు చేరుకొని కేసు వివరాలు తెలుసుకున్నారు. బాధితురాలితో మరోసారి మాట్లాడతానని, ఆధారాలు సేకరించి చర్యలు తీసుకుంటామని అన్నారు. చట్టప్రకారం బాధితులకు ఎలాంటి న్యాయం చేయాలో చేస్తామని చెప్పారు.

## పోలవరం ఎత్తు పెంచొద్దు..

**పీపీఏకు తెలంగాణ సర్కార్ లేఖ**

**హైదరాబాద్, మే 11:** పోలవరం ఎత్తు పెంచొద్దని పోలవరం ప్రాజెక్టు అథారిటీకి తెలంగాణ సర్కార్ డిమాండ్ చేసింది. పీపీఏ చైర్మన్‌కు తెలంగాణ సాగునీటి పారుదల శాఖ ఈఎన్సీ రమేశ్‌బాబు సోమవారం లేఖ రాశారు. ప్రాజెక్టును రెండు దశల్లో చేపట్టాల్సి ఉన్నదని గుర్తు చేసింది. మొదటి దశ లో 41.15మీటర్లు, రెండో దశలో 45.72 మీటర్ల ఎత్తుకు పెంచాల్సి ఉ న్నదని తెలిపారు.రెండో దశకు సం బంధించి ముంపు సర్వే, పునరావాసం, ముంపు నివారణ చర్యలపై అనేక వివాదాలున్నాయని తెలిపిం ది. ముంపుపై సర్వే నిర్వహించాలని ఛత్తీస్‌గఢ్‌తోపాటు తెలంగాణకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీచేసింద ని, సర్వే చేయాలని ఉత్తర్వులు ఇ చ్చిందని వెల్ల డించారు. ఆయా అం శాలపై స్పష్టతనిచ్చే వరకూ ప్రాజెక్టు ఎత్తు పెంపును విరమిం చుకోవాలని తెలంగాణ డిమాండ్ చేసింది.



## ధర్మశాలలో పంజాబ్‌పై ఢిల్లీ ప్రతీకారం

**ఐదో విజయంతో ప్లే ఆఫ్స్ రేసులోకి**

**ధర్మశాల:** పంతొమ్మిదో సీజన్‌లో పంజాబ్ కింగ్స్ పరాజయాల పరంపర కొనసాగు తోంది. ధర్మశాలలో రెండొందలు కొట్టిన పంజాబ్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ చిత్తుగా ఓడిం చింది. 211 పరుగుల ఛేదనలో టాపార్డర్ విఫలమైనా.. అక్షర్ పటేల్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు డేవిడ్ మిల్లర్(51)లు కంగారు పడలేదు. కాస్త కుదురుకున్నాక గేర్ మార్చిన ఇద్దరూ అర్ధ శతకాలతో మెరవ గా.. ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్ శర్మ(24), అకీబ్ నబీ(10 నాటౌట్) ఒత్తిడికి లోనవ్వకుండా లాంఛనం పూర్తి చేశారు. దాంతో, పంజాబ్‌కు వరుసగా నాలుగో ఓటమి ఎదురవ్వగా.. ఐదో విజయంతో ఢిల్లీ ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది. ప్లే ఆఫ్స్ రేసులో వెనక బడిన ఢిల్లీ క్యాపిటల్స్ అదిరే విజయంతో ముందంజ వేసింది. గత మ్యాచ్‌లో రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆశలు సజీవంగా ఉంచుకుంది. సోమవారం ధర్మశాల వేదికగా జరిగిన మ్యాచ్‌లో అక్షర్ పటేల్(56), డేవిడ్ మిల్లర్(51) వీరబాదు డుతో పంజాబ్‌పై ప్రతీకార విక్టరీతో మురిసింది ఢిల్లీ.ఛేదనలో ఢిల్లీకి ఆదిలోనే షాకిచ్చాడు యశ్ ఠాకూర్. అభిషేక్ పొరెల్(5)ను బౌల్డ్ చేయగా.. అర్ష్‌దీప్ ఓవర్లో ఫోర్ బాదిన కేఎల్ రాహుల్(9).. షార్ట్ బంతికి దొరికి పోయాడు. 14 పరుగులకే ఓపెనర్లు డగౌట్ చేరారు. ఓ సిక్సర్‌తో అలరించిన కుర్రాడు సహిల్ పరాక్ (0) సైతం అర్ష్ దీప్ ఓవర్లో స్లిప్‌లో



చాహల్‌కు క్యాచ్ ఇచ్చేశాడు. అనంతరం కెప్టెన్ అక్షర్ పటేల్(56), స్టబ్స్(12) దూకుడుగా ఆడా రు. స్టోయినిస్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు బాదిన అక్షర్ ఆఖరి బంతికి ఔటయ్యాడు.

## మృతురాలి కుటుంబానికి

# ఉప్పల వెంకటేష్ ఆర్థిక సాయం

వాస్తవం : మాడ్గుల

కల్వకుర్తి నియోజకవర్గం,మాడ్గుల మండలం కలకొండ గ్రామంలో బచ్చమోని సాయమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. ఈ విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ,మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం 3000 రూపాయలు అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు చింతపల్లి బాలరాజ్ గౌడ్ , ప్రధాన కార్యదర్శి ఎల్లికంటి సైదులు, డొంకి శ్రీనివాసులు, పార్టీ వార్డ్ సభ్యులు పల్లె నరేష్, గోరెంట్ల శ్రీశైలం డొంకి రాము, రాజమోని శ్రీశైలం ఆంబోజు జంగయ్య ,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## హనుమాన్ జయంతి సందర్భంగా

# భీమేశ్వరాలయంలో ఏర్పాట్లు

వాస్తవం : వేములవాడ

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండనున్న నేపథ్యంలో దేవస్థానం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటికే కొన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, మరికొన్ని పనులు కొనసాగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో భారీ ఫ్యాన్లు, క్యాలైన్లలో జంబో కూలర్లు, అదనపు ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే భక్తులకు నీడ కల్పించేందుకు చలువ పందిళ్లు, చలివేంద్ర కేంద్రాలు ఏర్పాటు చేశారు.శ్రీ రాజరాజేశ్వర జల ప్రసాదం ఆధ్వర్యంలో సేవా వాలంటీర్ల సహకారంతో చల్లని తాగునీటి పంపిణీ నిర్వహిస్తున్నారు. కూల్ బబుల్స్ ద్వారా నిరంతరం భక్తులకు తాగునీరు అందుబాటులో ఉంచుతున్నారు. మహా మండపంలో ఎయిర్ కండిషనర్లు , ఫ్యాన్లు ఏర్పాటు చేయగా, మూల విరాట్టు దర్శన మార్గాల్లో జంబో కూలర్లు ఏర్పాటు చేసి భక్తులకు చల్లని వాతావరణం కల్పిస్తున్నారు.అదేవిధంగా భక్తులకు ప్రసాదాల పంపిణీ, దర్శన ఏర్పాట్లు, తాగునీటి సదుపాయాలు సక్రమంగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. హనుమాన్ జయంతి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు.దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ , ప్రభుత్వ విప్ , వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి శైలజ రామయ్య, గౌరవనీయులు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ ఆదేశాల మేరకు ఆలయ ఈవో రమాదేవి ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.





## బక్రీద్ సందర్భంగా

## పశువుల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా

**మూడు చెక్ పోస్టులు ఏర్పాటు**

**సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా**

**జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే**

వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లా వ్యాప్తంగా మూడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.జిల్లా పరిధిలో మూడు తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల , గంభీరావుపేట మండలం పెద్దమ్మ చౌరస్తా,రుద్రంగి మండలం మానాల క్రాస్ రోడ్ వద్ద) చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటుగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలపై నిఘా ఉంచుతున్నామన్నారు.పశువులను అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, ఇది మూగజీవాల పట్ల క్రూరత్వానికి దారితీస్తుందన్నారు.గోరక్షణ పేరుతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దాడులు చేయడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడడం చట్టరీత్యా నేరమని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.సోషల్ మీడియా వేదికగా మత పరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు.



## జనగణన కార్యకలాపాలకు

## కంప్యూటర్, ప్రింటర్ల అందజేత



వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)

జనగణన -2027 భాగంగా కార్యకలాపాలను అంతరాయం కలగకుండా నిర్వహించేందుకు జనగణన ఛార్జ్ అధికారులకు కంప్యూటర్, ప్రింటర్లను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని మండలాల ఛార్జ్ అధికారులకు అందజేశామని తెలిపారు. జనగణన ప్రక్రియను సమగ్రంగా, ఖచ్చితంగా నిర్వహించేందుకు,సమాచార సేకరణ, నివేది కల తయారీ వేగవంతంగా చేసేందుకు కంప్యూటర్లు, ప్రిం టర్లు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస చారి, ఎస్ ఓ సంపత్, ఛార్జ్ అధికారులు పాల్గొన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో

## కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



వాస్తవం : లక్ష్మణ చందా

సోమవారం లక్ష్మణ్ చందా మండలం వడ్యాల్ గ్రామంలో మన నిర్మల్ డిఎస్పి టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్ష్మణ్ చందా పోలీసు సిబ్బంది కలిసి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డి.ఎస్.పి మాట్లాడుతూ ప్రజలు మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని మరియు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు.అలాగే గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సోన్ సిఐ గోవర్ధన్ రెడ్డి , ఎస్ఐలు శ్రావణి, గోపి, హనుమాన్లు పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న

# టిప్పర్ స్వాధీనం




వాస్తవం : చందుర్తి

చందుర్తి మండలం తిమ్మాపూర్ నుంచి ఆశిరెడ్డిపల్లి గ్రామాల శివారులో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న కూతురు మహేందర్ రెడ్డికి చెందిన టిప్పర్‌ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల గురించి రెవెన్యూ అధికారులకు పంపడం జరిగిందని చందుర్తి ఎస్ఐ జిల్లెల్ల రమేష్ ప్రకటించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# చిదినేపల్లిలో డ్రై డే, దోమల నివారణ చర్యలు



**వాస్తవం : కాటారం**

కాటారం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిదినేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా డ్రై డే, శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సిహెచ్ మధుసూదన్, జిల్లా మలేరియా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సందీప్ ఆదేశాల మేరకు స్థానిక వైద్యాధికారి డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ జగదీష్ సహకారంతో గ్రామంలో మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శానిటేషన్ పనులు చేపట్టి ఆల్ఫా సైబర్ మేత్రిన్ 5 శాతం మందును ఇంటింటికి పిచికారీ చేశారు. ప్రతి ఇంటిలో డ్రై డే నిర్వహించి ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటల లోపు పనులు ముగించుకోవాలని, ఓఆర్ఎస్ ద్రావణం లేదా నిమ్మరసం, ఉప్పు కలిపిన నీరు తాగాలని తెలిపారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొర్రల రాజయ్య, సభ్యులు మంతెన రాజేశ్వర్, శ్రీనివాస్, సమ్మయ్య, లచ్చయ్య, దేవేందర్, జిల్లా అకడమిక్ టీం సభ్యులు కాపర్తి రాజు, తలకోటి పరమేశ్వర్, హెల్త్ అసిస్టెంట్ తేజావత్ సమ్మయ్య, మహిళా హెల్త్ అసిస్టెంట్ సుజాత, ఆశా కార్యకర్త రాజేశ్వరి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఏసీబీ వలకు చిక్కిన కొమురవెల్లి పంచాయతీ కార్యదర్శి

**రూ.10 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ అధికారి**

**వాస్తవం : కొమురవెల్లి**

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేశారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ భర్త లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కొమురవెల్లి గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుడి ప్లాట్‌లో గ్రామ పంచాయతీ వారు డ్రైనేజీ పైప్‌లైన్ వేశారు. ఆ పైప్‌లైన్‌ను తొలగించాలని అధికారిక పని కోసం పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజు గౌడ్ రూ:10 వేల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో అధికారులు నిఘా పెట్టారు. సోమవారం సాయంత్రం 4.40 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే పంచాయతీ కార్యదర్శి ఆదేశాల మేరకు సర్పంచ్ గొల్లపల్లి పద్మ భర్త గొల్లపల్లి అంజనేయులు లంచం డబ్బులు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేశారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని లంచం సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడి, అనుచిత లబ్ధి పొందేందుకు ప్రయత్నించినందుకు కార్యదర్శి రాజు గౌడ్, సర్పంచ్ భర్త అంజనేయులును అరెస్టు చేశారు. వారిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరచనున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఏ ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినా టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయండి. ఫిర్యాదుదారుల వివరాలు రహస్యంగా ఉంచుతాం అని ఏసీబీ అధికారులు తెలిపారు.



# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన విద్య

**సద్వినియోగం చేసుకోండి**

**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలంలో బోర్డు కమిషనర్, ఆర్.జె.డి ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి సూచనల మేరకు సోమవారం యెల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యావారోత్సవాల్లో భాగంగా అధ్యాపకులు, తల్లిదండ్రులు, డిజిటల్ బోర్డులను అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల కరపత్రాల ప్రదర్శన చేశారు. ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి వాట్సాప్ ద్వారా సందేశం అందించారు. విశాలమైన తరగతి గదులున్నాయని, ఆర్.ఒ మినరల్ వాటర్ సౌకర్యం కలదని, అనుభవజ్ఞులైన అధ్యాపకులు బోధన చేస్తున్నారని, ఉచిత పుస్తకాలు పంపిణీతో డిజిటల్ బోర్డులద్వారా సి.సి పర్యవేక్షణలో, ఆధునాతన సైన్స్ పరికరాలతో మెరుగైన విద్య అందిస్తున్నామన్నారు. కళాశాలలో విద్యార్థులు చేరి సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, వాసరవేణి పర్శరాములు, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణు ప్రసాద్, వెల్లండి సౌమ్య, అగోలం గౌతమీ, బోధనేతర సిబ్బంది వి.విమల్ కుమార్, కనిమేని దేవేందర్, ఎం.నిఖిల్ తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆర్థిక సాయం

**వాస్తవం : శంకరపట్నం :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన పొన్నాల చంటికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆర్థిక సహాయంగా 60వేల రూపాయలు అందించారు. కరీంనగర్ నుంచి చెంజర్లకు బైక్ పై వస్తుండగా ఖాదరగూడెం స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం గురించి ఆరా తీసిన డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు గాయపడ్డ చంటి నిరుపేద అని తెలపడంతో ఈ ఆర్థిక సహాయం అందించారు. ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో సోమవారం ఈ నగదు మొత్తాన్ని చంటి కుమారుడు అనిల్ కు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు శ్రీగిరి రంగా రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నందగిరి రవీంద్రచారి, బండారి రమేష్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, గోపు మల్లారెడ్డి, గొల్లైన కొమురయ్య, బుర్ర చంద్రాకర్ తదితరులు పాల్గొన్నారు.



## అంకుషాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**వాస్తవం : కాటారం**

కాటారం మండలం అంకుషాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల-సమ్మయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరతో పాటు పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి కేంద్రంలో విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చినాల బ్రహ్మారెడ్డి, సర్పంచులు సోదారి కల్పన-దేవయ్య, ఇనుగాల లింగయ్య, ఉపసర్పంచ్ ఉమాశంకర్, వార్డు సభ్యులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాటారం ఐటీఐలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**వాస్తవం : కాటారం**

కాటారం ప్రభుత్వ ఐటీఐలో 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. మే 14 నుంచి జూన్ 8 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన వెల్లడించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మెరిట్ ఆధారంగా ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్లతో పాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో సీఎన్సీ మెషినింగ్, ఎలక్ట్రిక్ వెహికల్, రోబోటిక్స్ కోర్సులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఈ కోర్సులు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచుతాయని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## జల్లిపట్టే యంత్రంలో తలవెంట్రుకలు చిక్కుకుని మహిళా కూలీ మృతి

**వాస్తవం : చేర్యాల**



చేర్యాల మండలం కాశగుడిసెల గ్రామంలో సోమవారం ఉదయం విషాదకర ఘటన చోటుచేసుకుంది. వడ్లు శుభ్రం చేసే ప్యాడీ క్లీనర్ యంత్రంలో తలవెంట్రుకలు చిక్కు కోవడంతో షేక్ ఇమాంబి 50 సం: అనే మహిళా కూలీ అక్క డికక్కడే మృతి చెందింది. వడ్లు జల్లిపడుతుండగా, ప్రమాదవశాత్తు ఆమె జుట్టు యంత్రంలో ఇరుక్కుపోయింది. యంత్రం వేగంగా తిరుగుతుండటంతో తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. మృతురాలికి భర్త, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కొన్ని నెలల క్రితమే కుమారుడు అనారోగ్యంతో మరణించగా, తాజాగా తల్లి మృతితో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న చేర్యాల ఎస్ఐ గూడ అపూర్వ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. యంత్రాల వద్ద పనిచేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, జుట్టును కట్టుకోవడం, వదులుగా ఉన్న దుస్తులు ధరించక పోవడం వంటి భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

### వికలాంగులకు చెక్కుల పంపిణీ చేసిన

# హ్యూమన్ రైట్స్ జస్టిస్ కౌన్సిల్

**వాస్తవం : శేర్లింగంపల్లి:**
శేరిలింగంపల్లిలో హ్యూమన్ రైట్స్ జస్టిస్ కౌన్సిల్ సంస్థ ఆధ్వర్యంలో వికలాంగులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది వికలాంగులకు చెక్కులు అందజేశారు. ప్రతి నెలా సంస్థ తరఫున రూ.500 చొప్పున చెక్కులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఇంకా దాతలు ముందుకు వచ్చి సంస్థకు సహకరించాలని, ఆర్థిక సాయం చేయవచ్చని పేర్కొన్నారు. ప్రతి నెల 10వ తేదీన వికలాంగులకు చెక్కులు పంపిణీ చేస్తామని తెలిపారు. కుల, మత భేదాలు లేకుండా అందరి కోసం ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.సంస్థ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ పొందిందని, అంతర్జాతీయ స్థాయిలో కూడా సేవలు అందిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మొహమ్మద్ అబ్దుల్ రెహమాన్, షైక్



అహమ్మద్, శివ కుమార్, శంకర్ రావు, ధర్మేందర్, టాస్లీమ్ బేగం, ఎం డి గౌస్, ఎండి నిస్సర్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి



**బాపు నాయక్**

**వాస్తవం : చెన్నూర్ ఆర్సి**
కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైనా చర్యలు తీసుకోకపోవడం పట్ల కోటపల్లి మండల సోషల్ మీడియా బాపు నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాధారణ ప్రజలకు ఓ నీతి.. మంత్రి కొడుక్కి మరో నీతా అని ప్రశ్నించారు. బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని విమర్శించారు. ఒక మైనర్ బాలిక మూడు నెలలుగా న్యాయం కోసం పోరాడాల్సి రావడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. బాధితురాలు,ఆమె కుటుంబాన్ని నేరస్థుల్లా వేధించడం అత్యంత దారుణమని మండిపడ్డారు.“బేటీ బచావో” అంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పే బీజేపీ నాయకత్వం, ఇప్పుడు కేంద్ర మంత్రి కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో ఎందుకు మౌనం వహిస్తోందని ఆయన ప్రశ్నించారు.

# ఎఫ్ఐఆర్ నమోదైనా అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యం ఏంటి?

**సాధారణ కేసు నమోదు చేసి, నిర్వీర్యం చేసేందుకు కుట్రలు**

**వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలి**

**హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్**

**వాస్తవం : హుస్నాబాద్ :**
కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలుస్తూ ఆయన కొడుకు భగీరథ్ ఫోక్సో కేసును నీరుగార్చే కుట్రలు జరుగుతున్నాయని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ ను ఇంతవరకు అరెస్టు చేయకపోవడంపై స్పందిస్తూ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడిన భగీరథ్ పై బాధితుల ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేసి మూడు రోజులు గడుస్తున్నా ఇంకా అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు? హోం మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే పోలీసులు అరెస్టు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన బాలికతో పాటు వారి కుటుంబ సభ్యులపై పోలీసులు బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. పోక్సో కేసు కాకుండా సాధారణ కేసు నమోదు చేసి కేసు మొత్తాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. మంత్రుల కొడుకులకైతే ఒక న్యాయం, ఇతరులకు మరొక న్యాయం ఉం టుందా అని ప్రశ్నించారు? వెంటనే బండి సంజయ్ కొడుకు భగీరథ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్‌ని



వెంటనే మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో చట్టాలపై ప్రజలకు ఉన్న గౌరవం పూర్తిగా తగ్గిపోతుందన్నారు. పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. భగీరథ్ కేసులో ఇంకా జాప్యం చేస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగుతామని సతీష్ కుమార్ హెచ్చరించారు.

### మణికొండలో

# పర్యటించిన కమిషనర్



**వాస్తవం : రాజేంద్రనగర్**
స్థానిక సమస్యల పరిష్కారం కొరకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన మణికొండ డివిజన్ పరిధిలో పర్యటించారు. సోమవారం జిహెచ్ఎంసి అధికారులతో కలిసి ఆమె మణికొండ వార్డ్ 127లోని అబ్దుల్ కలాం పార్కును సందర్శించారు. స్థానిక నాయకులతో, కాలనీ వాసులతో చర్చించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంచవటి కాలనీ అధ్యక్షుడు, ది సిటిజన్స్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ పలు అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో భాగంగా బుల్కాపూర్ నాలాను పునరుద్ధరణ చేయాలని కోరారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మర్రిచెట్టు రోడ్డులో తొలగించిన బస్సు షెల్టర్‌ను తిరిగి ఏర్పాటు చేయాలని తెలిపారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ సమయానుకూలంగా ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


**కొనుగోలు కేంద్రాల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్**

**వాస్తవం : హుస్నాబాద్ :**
హుస్నాబాద్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలకు భారీగా ధాన్యం వస్తుండడంతో రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు ప్రక్రియ వేగంగా జరగాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడేలా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పన్నారు.కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగ్స్ కొరత రాకుండా చూసుకోవాలని, సాయంకాలం వర్షం వస్తే ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి వేసిన ఐదుగురు సభ్యుల కమిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షించాలని, కొనుగోలు కేంద్రాల్లో ఏ సమస్య వచ్చిన కార్యాలయ దృష్టికి తీసుకు రావాలన్నారు.గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కొనుగోలు విషయంలో ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,మిల్లుల వద్ద సమస్య రావద్దని, ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు పై కంట్రోల్ రూమ్ ద్వారా ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం పై మానిటరింగ్ చేయాలని, ధాన్యం తరలింపులో వాహనా ల సమస్య రావద్దని,ప్రతి జిల్లాకు ఒక ఏంవిఐ అధికారిని ప్రత్యేకంగా వాహనాలు తరలించడానికి కంట్రోల్ రూమ్ ద్వారా



ఏర్పాటు చేయాలని డిటిసిలకు ఆదేశాలు ఇచ్చారు.హామాలీల కొరత లేకుండా చూసుకోవాలని, హుస్నాబాద్ మార్కెట్ యార్డులో అడుగు పెట్టేంత స్థలం లేకుండా ధాన్యం వస్తున్నందున ఇప్పటికే ఐదు బృందాలు కాంట వేస్తున్నందున అదనంగా ఏర్పాటు చేయాలన్నారు. ఏ గ్రామం నుండి సమస్య వచ్చినా, ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఏఈవో, గ్రామ కమిటీ కో ఆర్డినేట్ చేసుకోవాలన్నారు. ఇక నుండి రోజువారీగా అధికారులతో టెలికాన్ఫెరెన్స్ నిర్వహిస్తానని మంత్రి చెప్పారు.

# రైతులను నిలువునా ముంచుతున్న రైస్ మిల్లర్స్

**కొనుగోళ్ళు వేగవంతం లేక రైతులకు కష్టాలు**
**బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి**



**వాస్తవం : హుస్నాబాద్ :**

కొనుగోళ్లు వేగవంతం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ధాన్యం కాంటాలు అయిపోయి రైస్ మిల్లులకు తరలిస్తే అక్కడ మిల్లర్స్ ఏ గ్రేడ్ బి గ్రేడ్లు అని చూడకుండా ధాన్యం అంతా కామన్ గ్రేడ్ కింద కొనుగోలు చేసి తరుగు తీసి రైతులను నిండా ముంచుతున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. సోమవారం మండలం లోని పందిళ్ళ రైస్ మిల్లుల్లో ధాన్యం అన్లోడింగ్ సమస్యలపై తరుగుపై పరిశీలించి అనంతరం మాట్లాడారు. రైతులు అనేక పెట్టుబడులు పెట్టి ధాన్యాన్ని అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు వెళ్తే అడుగడుగునా కష్టాలు, నష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొనుగోళ్లు వేగవంతం లేకపోవడం వల్ల రోజుల కొద్దీ కాలం గడపాల్సి వస్తుందని, మిల్లర్స్ ఏ గ్రేడ్ బి గ్రేడ్ అని చూడకుండా ధాన్యం అంతా కామన్ గ్రేడ్ కింద కొనుగోలు చేసి తరుగు తీస్తున్నారని, ప్రశ్నిస్తే ధాన్యం అంతటినీ కామన్ గ్రేడ్ కింద తీసుకుంటున్నట్లు చెబుతున్నారని అన్నారు. ఇలా కామన్ గ్రేడ్ కింద మిల్లర్స్ ధాన్యాన్ని తీసుకుంటే రైతులకు వచ్చే నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రైతుల ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ గొప్పలు చెప్పుకొని ప్రచారం చేసుకోవడమే తప్ప రైతులను ఆదుకోవడంలో విఫలం చెందిందని ఆరోపించారు. అలాగే ధాన్యం అన్ లోడింగ్ లో ఆలస్యం కావడంతో ట్రాక్టర్ డ్రైవర్ అనేక ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టించుకోవాలన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు



**వాస్తవం: హుస్నాబాద్ :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో విద్యా వారోత్సవాలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి ఘనంగా ప్రారంభించారు. మే 11 నుండి 17 వరకు జరగనున్న నేపథ్యంలో మొదటి రోజులో భాగంగా కళాశాలలో ఉన్న బోధనా వసతులు, సౌకర్యాలు మరియు విద్యా పరంగా సాధిస్తున్న ప్రగతిని తెలుపుతూ ప్రచార కర పత్రికలను ఆవిష్కరించారు. విద్యార్థులకు ఉపయోగ పడే విధంగా అంతర్జాలంలో ఉన్న ఎలక్ట్రానిక్ రిసోర్సెస్ వివరాలతో కూడిన పుస్తకమును రూపొందించి విద్యార్థులకు అందించారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి మరియు ఉద్యోగాల కల్పన కై స్థానిక జిన్నింగ్ కంపెనీ తో అవగాహనా ఒప్పందంను చేసుకు న్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ... విద్యా వ్యవస్థను పటిష్ట పరచడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యా వారోత్సవాలలో విద్యార్థులను, స్థానిక యువత, ప్రజా ప్రతినిధులను భాగ స్వామ్యం చేయడం ద్వారా కళాశాల అభివృద్ధికోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# భారత ప్రగతికి నారీశక్తి ఆధారం

**డీఎస్పీ రవిబాబు**
**మహిళ , బాలికల భద్రతపై అవగాహన**



**వాస్తవం : డి. హిరేహాళ్ మే 11**

భారతదేశ ప్రగతికి నారిశక్తి ఒక మహత్తరమైన ఆధారం దానిని గుర్తించిన దేశం ఎన్నటికీ సుభిక్షంగా ఉంటుందని కళ్యాణదుర్గం డిఎస్పి రవిబాబు పేర్కొన్నారు. మహిళా మరియు బాలికల భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు మండలం లోని మురడి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళల భద్రత అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి మండల కన్వీనర్ మోహన్ రెడ్డితో కలిసి డిఎస్పి రవిబాబు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మహిళ బాలికల భద్రతపై వివిధ చట్టాలు మరియు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం డిఎస్పి రవిబాబు మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి పార్టీ మండల కన్వీనర్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ స్త్రీ ఎక్కడైతే గౌరవించబడుతుందో అక్కడ సుభిక్షంగా ఉంటుందని అన్నారు. గౌరవనీయ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గారు పేర్కొన్నట్లుగా, విద్యావంతులైన, స్వయంశక్తితో ఎదిగిన మహిళలే దేశాభివృద్ధికి మూల స్తంభాలు. మహిళలు కేవలం గృహిణులు మాత్రమే కాదు, దేశ భవిష్యత్తును నిర్మించే శిల్పులు.రాజకీయ, రక్షణ, సాంకేతిక రంగాలలో మహిళలు అగ్రస్థానంలో నిలుస్తున్నారు. నిర్మలా సీతారామన్ వంటి వారు రక్షణ, ఆర్థిక శాఖలను నిర్వహించడం, కిరణ్ బేడి వంటి వారు తొలి మహిళా ఐపీఎస్ అధికారిగా రాణించడం మహిళా శక్తికి నిదర్శనం.వివేకానందుడు చెప్పినట్లు స్త్రీలు ఉద్ధరణ జరగకుండా భారతదేశం పురోగమించదు నేడు విద్య, ఉపాధి రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరుగుతుండటం దేశానికి ఎంతో మంచి పరిణామం.పురాణాల కాలం నుండి నేటి ఆధునిక కాలం వరకు, స్త్రీ సృజనాత్మకత, కరుణ, మరియు పాలనా దక్షతతో కుటుంబాన్ని, దేశాన్ని నడిపిస్తోంది అని అన్నారు. దీనికి అనుగుణంగానే కూటమి ప్రభుత్వం కూడా మహిళ భద్రత పై అనేక రకాల కార్యక్రమాలను ప్రవేశపెట్టిన ఈ సందర్భంగా పేర్కొన్నారు ఈ కార్యక్రమం నందు ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి నాగ మధు ఎంపీటీసీ గంగాధర మాజీ సర్పంచ్ మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ దొడగట్ట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రామారావుపేటలో కలెక్టర్ కుమార్ దీపక్ పర్యటన

**వరి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశాలు**



**జైపూర్ : వాస్తవం**

జైపూర్ మండలంలోని రామారావుపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పర్యటించి రైతులు ఎదుర్కొంటున్న వరి ధాన్యం కొనుగోలు సమస్యలను పరిశీలించారు. కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సకాలంలో కొనుగోలు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామంలోని చెరువు మత్తడి సమస్యను కూడా పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు తెలిపారు.కలెక్టర్ స్పందనపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# కలవమంది కేంద్రంతోనే

**మోదీ చెప్పింది రాష్ట్రాభివృద్ధి గురించే.. అందులో రాజకీయాలకు తావులేదు**

**హైదరాబాద్, మే 11 :** ప్రధాని నరేంద్ర మోదీ తనను కలవమని చెప్పింది కేంద్ర ప్రభుత్వంతో మాత్రమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అది కూడా రాష్ట్ర అభివృద్ధి కోసమేనని తేల్చిచెప్పారు. దాన్ని వేరేవిధంగా అర్థం చేసుకున్నారంటే అది వారి అవగాహన లోపమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరించాలని తాను కోరానని గుర్తు చేశారు. ప్రధాని కూడా అదే ఉద్దేశంతో స్పందిస్తూ, కేంద్రంతో కలవాలని ఆహ్వానించారని, అందులో ఎలాంటి రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. అభివృద్ధి ఒక్కరితోనే సాధ్యం కాదని, కేంద్రంతో కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్న భావనతోనే మోదీ అలా అన్నారని తెలిపారు. ఆదివారం హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసింది అధికారిక కార్యక్రమం అని చెప్పారు. అభివృద్ధి-సంక్షేమంలో కేంద్రంతో కలిసి వెళ్లేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. సోమవారం రేవంత్‌రెడ్డి తన నివాసంలో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పలు ప్రాజెక్టులకు ఆమోదం రావడం లేదని చెప్పారు. గత పదేళ్లలో కేసీఆర్ కేంద్రాన్ని ఏమీ అడగలేదని, పైగా మీ నిధులు వద్దని, ప్రేమ చాలంటూ మెదక్ సభలో మోదీతో కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. దేశ ప్రజలు ఏడాది పాటు బంగారం కొనొద్దని, పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని, విమానం ఎక్కొద్దంటూ మోదీ పిలుపునివ్వడాన్ని రేవంత్ తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్రం వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజలపై నిషేధం విధిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.




# అక్రమంగా బీసీ-డి కుల ధృవీకరణ పత్రం

**మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు**

**వాస్తవం : చెన్నూర్**

మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ప్రజా వాణిలో చెన్నూర్ పట్టణానికి చెందిన మార్వాడి వ్యాపారవేత్త శ్యామ్ సుందర్ దేవడా అక్రమంగా బీసీ-డి కుల ధృవీకరణ పత్రం పొందిన విష యంపై మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు బీసీ జేఏసీ చైర్మన్ సిద్ధి రమేష్ యాదవ్ ఫిర్యాదును సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శ్యామ్ సుందర్ దేవడా అసలు ఓసీ కమ్యూనిటీకి చెం దిన వ్యక్తి అయినప్పటికీ, ప్రభుత్వ శాఖలను తప్పుదారి పట్టిస్తూ బీసీ-డి (మాలి) కుల ధృవీకరణ పత్రాన్ని అక్ర మంగా పొందినట్లు ఆరోపించారు. ఇం దుకు సంబంధించిన ధృవీకరణ పత్రం నంబర్ సిఎన్‌డీ022324883530, తేదీ 04-01-2023 వివరాలను అధి కారులకు సమర్పించినట్లు తెలిపారు. ఇంకా, అదే వ్యక్తి గతంలో కాళేశ్వరం ముక్తీశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యునిగా ప్రభుత్వం నియమించిన సమయంలో ఆయన కమ్యూనిటీని ఓసీగా పేర్కొన్నట్లు తెలిపారు. ఈ అంశం ప్రస్తుతం పొందిన బీసీ-డి కుల ధృవీకరణ పత్రం చట్టబద్ధతపై తీవ్రమైన అనుమానాలను కలిగిస్తోందన్నారు. అలాగే, శ్యామ్ సుందర్ దేవడా రాజ స్థాన్ రాష్ట్రానికి చెందిన మార్వాడీ వ్యాపార వర్గానికి చెందిన వ్యక్తిగా చెన్నూర్‌లోని మార్వాడీ భవన్ కార్యకలా పాలలో నిరంతరం పాల్గొంటూ తమ కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహి స్తున్నారని, అయినప్పటికీ తప్పుడు సమాచారం ద్వారా బీసీ-డి కమ్యూని టీకి చెందిన వ్యక్తిగా చూపించుకొని ప్రభుత్వ ప్రయోజనాలు పొందడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విధంగా తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు పొందడం వల్ల నిజమైన బీసీ వర్గాలకు చెందిన అర్హులైన వ్యక్తులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, రిజర్వేషన్ వ్యవస్థ యొక్క అసలు



ఉద్దేశ్యమే దెబ్బతింటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహా రంపై సమగ్ర విచారణ జరిపి, సంబం ధిత అధికార రికార్డులను పరిశీలించి, అక్రమంగా పొందిన బీసీ-డి కుల ధృవీకరణ పత్రాన్ని వెంటనే రద్దు చేయాలని, అలాగే ఇందులో సంబంధం ఉన్న వారిపై చట్టపరమైన మరియు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జిల్లా పరిపాలనను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల బీసీ జేఏసీ కన్వీనర్ వొడ్డేపల్లి మనోహర్, హై కోర్ట్ న్యాయవాది పొన్నం రవీందర్, అక్కల రాజన్న యాదవ్ పాల్గొన్నారు.

# నూతన విద్యావిధానం అమలు చేస్తాం

## సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మే11 :** తెలంగాణలో నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ విద్యలో తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలబట్టడమే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. దేశానికి ఆదర్శంగా నూతన విద్యావిధానం ఉండాలన్నదే తమ ప్రయత్నమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రవేశపెడుతున్నామని వివరించారు. పదోతరగతి పాస్ అయిన తర్వాత ఇంటర్‌లో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయని తెలిపారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని పేర్కొన్నారు. సోమవారం రూ.1011 కోట్లతో క్యూర్ ప్రాంతంలో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఈనెల 17వ తేదీ వరకు తెలంగాణ వ్యాప్తంగా విద్యావారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్ల బలోపేతమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. కులవివక్షను రూపుమా ఎందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కోసం రూ.1700 కోట్లతో అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. 1969 తొలి తెలంగాణ ఉద్యమం, 2009 మలి తెలంగాణ ఉద్యమంలో యూనివర్సిటీల విద్యార్థులు ఉవ్వెత్తున ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని ప్రస్తావించారు. తెలంగాణ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, నిధులు, నియామకాలు, రాజకీయ ప్రాతినిధ్యంపైన ఉస్మానియా, కాకతీయ విద్యార్థులు ఉద్యమ బాటన నడిచారని చెప్పుకొచ్చారు. యూనివ ర్శిటీలు, విద్యను నిర్లక్ష్యం చేస్తే తెలంగాణ సమాజం బలహీనపడుతుందని అన్నారు. పేదలకు న్యాయమైన విద్య, సాంకేతిక నైపుణ్యాన్ని అందించడం తమ ప్రభుత్వ బాధ్య త అని వ్యాఖ్యానించారు.. తెలం గాణలోని తండాలు, గూడాలు, మారు మూల గ్రామాల్లోని పేదలు, దళితులు, గిరిజనులకు విద్యను



అందించాలని విద్యాశాఖను తన దగ్గరే ఉంచుకుని అడుగులు ముం దుకు వేస్తున్నామని తెలిపారు.. 22 వేల టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చాం. ప్రైవేట్ స్కూల్స్‌లో ఉన్న గొప్పతనం ఏమిటీ.. ప్రభుత్వ స్కూళ్లలో ఉన్న లోపం ఏమిటో..? పరిశీలించుకోవాలని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 8 శాతం నిధులను విద్య కోసం కేటాయిం చామని తెలిపారు. వచ్చే ఏడాది విద్యకు అధికంగా నిధులు ఇస్తామని స్పష్టం చేశారు. 15 శాతానికి క్రమంగా పెంచుతామని వివరించారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించే టీచర్లను అభినందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని ఉద్ఘాటించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున టీచర్లను సన్మానిస్తామని చెప్పుకొచ్చారు. పేద విద్యార్థులు ఆర్థికలితో పాఠశాలలకు వస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన భోజనం అందిస్తామని స్పష్టం చేశారు. పాఠశాల విద్యార్థులకు పాలు, రాగిజావ అందిస్తామని ప్రకటించారు. కొడంగల్‌లో పైలెట్ ప్రాజెక్టుగా పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని ప్రస్తావించారు. ప్రభుత్వం పాఠశాల్లో చదివే విద్యార్థులు తమ పిల్లలతో సమానమని అన్నారు. తల్లిదండ్రుల్లా తమ ప్రభుత్వం విద్యార్థులను జాగ్రత్తగా చూసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 200 శాతం కాస్మొటిక్ ఛార్జీలు, 40 శాతం డైట్ ఛార్జీలు పెంచామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రేపటి తెలంగాణ ప్రభుత్వ పాఠశాల గదుల్లోనే ఉందని తాము భావిస్తున్నామని అన్నారు. విద్యాశాఖపైన పెట్టే ఖర్చును భవిష్యత్తు తరాల పెట్టుబడిగా భావిస్తు న్నామని తెలిపారు. యూనివర్శిటీలల్లో సదుపా యాల కల్పన కోసం వందలాది కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్నామని వివరించారు. 100 నియోజకవర్గాల్లో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను రూ.20 వేల కోట్లతో నిర్మిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణలోని పేదల బిడ్డలు ధైర్యంగా గుండెపైన చేయి వేసుకుని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో చదువుకు న్నామని చెప్పాలన్నదే తన ధ్యేయమని ఉద్ఘాటించారు. తామంతా ప్రభుత్వ స్కూళ్లలో చదువుకున్నామని.. ప్రభుత్వ పాఠశాలలు అనాథ శరణాలయాలు కాదని.. అభివృద్ధి వేదికలని వ్యాఖ్యానించారు. పేదలకు మేలు జరిగే ఏ నిర్ణయమైనా తాము వెనకడుగు వేయకుండా తీసుకుంటామని స్పష్టం చేశారు. 19 లక్షల మంది విద్యార్థుల కుటుంబాల భవిష్యత్తు ప్రభుత్వ ఉపాధ్యాయుల చేతిలో ఉందని అన్నారు. పేద తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పని చేయాలని సూచించారు. తెలం గాణ విద్యావిధానాన్ని దేశానికే ఆదర్శంగా నిలబడేలా ముందుకు సాగుదామని ఉద్ఘాటిం చారు. విద్యాశాఖకు మంత్రి లేరని కొందరు బుర్ర లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమె త్తారు. సమీక్షా సమయంలో తనను ముఖ్యమంత్రిగా కాకుండా విద్యాశాఖ మంత్రి గా చూడాలని సూచించారు. కావాలనే తాను విద్యాశాఖను తన దగ్గర పెట్టుకున్నానని స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యను అందించి.. బాధ్య త కలిగిన పౌరులను దేశానికి అందించా లన్నదే తన ఉద్దేశమని ఉద్ఘాటించారు. త్వర లోనే విద్యా శాఖలో మరిన్ని మంచి నిర్ణయా లు తీసుకుంటామని పేర్కొన్నారు.

# తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి



**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ మహిళా కమిషన్‌ను ప్రకటించింది . చైర్‌పర్సన్‌గా జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని నియమిం చింది. ఆమెతో పాటు సభ్యు లుగా కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ యాదవ రెడ్డి, సదాలక్ష్మి, రాధాబాయి, ఉజ్మా అసాయి షకిరాను నియ మించింది. వీరు ఐదేళ్ల పాటు పదవుల్లో కొనసాగుతారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్ రామకృష్ణరావు విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## తమిళనాడు మాజీ సీఎం నివాసానికి

# సీఎం విజయ్..

**సాదర స్వాగతం పలికిన ఎంకే స్టాలిన్..**



తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడు విజయ్ డీఎంకే అధినేత, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నివాసానికి వెళ్లారు. సోమవారం అసెంబ్లీలో నూతన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాలు పూర్తయి న వెంటనే విజయ్.. స్టాలిన్ నివాసానికి బయలుదేరారు. తన ఇంటికి వచ్చిన విజయ్‌కి ఉదయనిధి స్టాలిన్, ఎంకే స్టాలిన్ సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా ఉద యనిధి స్టాలిన్.. విజయ్‌కి ఎదురువెళ్లి ఆలింగనం చేసుకు న్నారు. తర్వాత ఇంట్లోకి తీసుకెళ్లారు. విజయ్‌కి ఇంట్లో ఎంకే స్టాలిన్ ఎదురుపడగానే రెండు చేతులు జోడించి నమస్క రించారు. వెంటనే ఎంకే స్టాలిన్ కూడా ప్రతి నమస్కారం చేశారు. అనంతరం ఎంకే స్టాలిన్.. విజయ్‌కి శాలువా కప్పి సత్కరించారు. విజయ్ కూడా స్టాలిన్‌కు శాలువా కప్పి సత్కారం చేశారు. తన నివాసానికి వచ్చిన విజయ్‌తో మాజీ సీఎం స్టాలిన్, మాజీ డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ కాసేపు ముచ్చటించారు. అయితే ఈ సందర్భంగా వారు ఏం మాట్లాడుకున్నారు అనే వివరాలు మాత్రం వెల్లడి కాలేదు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంకే స్టాలిన్ ఎమ్మెల్యేగా ఓడిపోవడంతో ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్‌ను డీఎంకే శాసన సభాపక్షనేతగా ఎన్నుకున్నారు. దాంతో అసెంబ్లీలో సీఎం విజయ్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌ల మధ్య వాడీవేడి చర్చ జరిగే అవకాశం ఉంది.

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190
జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Regd.No. 914/2015
JSS
JOURNALISTS SANKSHEMA SANGAM
TELANGANA ANDHRAPRADESH TRADE UNION

మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110